క్లుప్తంగా

చట్టాలపై అవగాహన ఉండాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ లక్ష్మణ

ఇచ్ఛాపురం రూరల్: విద్యార్థి దశ నుంచే విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని ఇచ్ఛాపురం రూరల్ ఎస్ఐ ఎస్.లక్ష్మణ అన్నారు. గురువారం ధర్మపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బాల్య వివాహాలను ప్రోత్సహించకుండా బాలికలు ఉన్నత విద్యను అభ్యసించేలా చూడాలన్నారు. విద్యార్థులు స్నేహ పూర్వకంగా మెలగాలని, ద్విచక్రవాహనాలు డ్రైవింగ్ చేయరాదని సూచించారు. ప్రధానోపాధ్యాయులు ఎస్.విశ్వనాథం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఐని కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



సీఐ చిన్నంనాయుడుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం పోలీసు సర్కిల్‌కు నూతన సీఐగా వచ్చిన మీసాల చిన్నంనాయుడును మండల వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్ప గుచ్ఛం అందజేసి అభినందించారు. గతంలో ఇచ్ఛాపురం రూరల్ ఎస్ఐగా సమర్థవంతంగా విధులు నిర్వహించి, సీఐగా ఇక్కడకు రావడం ఆనందంగా ఉందని నాయకులు అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. సీఐని కలిసిన వారిలో ఎంపీపీ బోర పుష్ప, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దక్కత నూకయ్యరెడ్డి, సర్పంచ్ కారంగి త్రినాథ్‌రెడ్డి, నాయకులు ఆశి పురుషోత్తమ రెడ్డి, నీలాపు డిల్లీ, ఆశి కృష్ణారెడ్డి, దాలయ్యరెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు



విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

సంతబొమ్మాళి: జాతీయ అంధత్వ, దృష్టిలోప నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో సంతబొమ్మాళిలోని మహాత్మ జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలను గురువారం నిర్వహించారు. ఆప్తాల్మిక్ అధికారి ఎం.ఆర్.కె.దాస్ సుమారు 215 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. వీరిలో 16 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించి ఉచిత కళ్లద్దాల కోసం సిఫార్సు చేశారు. కంటి ఆరోగ్యం– సంరక్షణపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ కృష్ణ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ



రోగులకు పండ్లు, రొట్టెలు అందజేస్తున్న అభిమానులు

ఇచ్ఛాపురం: పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత, సినీనటుడు చిరంజీవి పుట్టినరోజును పురస్కరించుకొని అతని అభిమానులు గురువారం సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఇచ్ఛాపురం పట్టణ చిరంజీవి అభిమాన సంఘం అధ్యక్షుడు అలీమ్‌ఖాన్ నేతృత్వంలో స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు. ఆస్పత్రి వైద్యాధికారి పి.దేవేంద్రరెడ్డి, అభిమానులు తిప్పన జనార్దన్, అజ్జుకుమార్, అజయ్ పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు రూ. 1.5 లక్షల విరాళం



కమిటీ సభ్యులకు చెక్కు అందజేస్తున్న శేఖర్ కుటుంబ సభ్యులు

కంచిలి: మండలంలోని ఎస్.ఆర్.సి.పురం గ్రామంలో గ్రామదేవత నిమ్మాసినమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణాన్ని చేపడుతున్నారు. అమ్మవారి విగ్రహం ఏర్పాటు కోసం కంచిలికి చెందిన కొత్తకోట శేఖర్ కుటుంబ సభ్యులు తన తండ్రి దివంగత నేతాజీ జ్ఞాపకార్థం రూ. 1.5 లక్షలు విరాళంగా ప్రకటించారు. ఈ మొత్తాన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఎస్.ఆర్.సి.పురం గ్రామస్తులు డొక్కరి బలరాం, గణప పాపారావు, కొల్లి మల్లేశ్వరరావు, కలియా క్రిష్ణ ఉన్నారు.

విలువైన భవనాలు..

నిర్లక్ష్యానికి ఆనవాళ్లు!

- నిరుపయోగంగా ప్రభుత్వ బిల్డింగులు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న వైనం

టెక్కలి రూరల్: ప్రభుత్వ ఆస్తులు కాపాడటమే ధ్యేయమని అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతుంటారు. అయితే వాస్తవరూపంలో పరిస్థితి వేరేలా ఉంది. కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ ఆస్తులు నిరుపయోగంగా మిగులుతున్నాయి. భారీ భవనాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. అలాంటి భవనాలను కాపాడి వాటిని వాడుకలోకి తీసుకు రావలసిన అధికారులు మాత్రం తమకేమి పట్టదు అన్నట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. టెక్కలి రెవెన్యూ డివిజన్ కేంద్రం పరిధిలోని చాలా ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. టెక్కలి పాతబస్టాండ్ సమీపంలో ఉన్న పాత ఆస్పత్రి భవనాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. 2022 ఏప్రిల్ ఆరో తేదీ వరకూ ఇక్కడే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నడిచేది. తరువాత దీనికి సమీపంలోనే కొత్త భవనాలను నిర్మించడంతో ఆస్పత్రిని అందులోనికి అధికారులు మార్చేశారు. అనంతరం ఆస్పత్రిని భవనాలను అలాగే విడిచిపెట్టేశారు. పాత ఆస్పత్రిలోని పసూతి విభాగంలో మాత్రం కోర్టును ఏర్పాటు చేశారు. మిగిలిన ట్రామాకేర్, ఓపీ విభాగాలను నిర్వహించే భవనాలను ఖాళీగా ఉంచేశారు. పాత ఆస్పత్రి మార్పక మునుపు భవనాల మరమ్మతుల కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేశారు. మరమ్మతులు జరిగిన కొద్దినెలలకే ఆస్పత్రిని కొత్త భవనంలోకి మార్చేశారు. దీంతో ప్రస్తుతం పాత ఆస్పత్రి భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అలాగే స్థానిక రోణంకి అప్పలస్వామి వీధి సమీపంలో ఆస్పత్రి సిబ్బంది కోసం క్వార్టర్లను నిర్మించారు. అయితే వీటిలో ఎవరూ ఉండడం లేదు. ఫలితంగా కొన్నేళ్లుగా ఖాళీగా ఉండడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటితోపాటు తెంబూరు రోడ్డులో జిల్లా ఆస్పత్రి సమీపంలో ఉన్న వంశధార అతిథి గృహం కూడా వినియోగంలో లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. ఈ ప్రాంతాన్ని కొంతమంది అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకున్నారు. అధికారులు పట్టనట్టు వదిలేయడంతో ఈ భవనం ఆక్రమణకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



నిరుపయోగంగా ఉన్న పాత జిల్లాఆస్పత్రి భవనాలు

అద్దె కొంపల్లో ప్రభుత్వ కార్యాలయాలు!

టెక్కలిలోని పలు ప్రాంతాల్లో విలువైన భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. వీటికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాల్సిన వివిధ శాఖల ఉన్నతాధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. అయితే చాలా ప్రభుత్వ కార్యాలయాలను వేలాది రూపాయలు చెల్లించి అద్దె కొంపల్లో నడిపిస్తున్నారు. వీటిలో ఎక్సైజ్, స్త్రీశిశుసంక్షేమ శాఖ, అటవీశాఖ, డివిజనల్ పంచాయతీ, రవాణా శాఖలకు చెందిన కార్యాలయాలు అద్దె భవనాలోలే నడుస్తున్నాయి. ఈ కార్యాలయాలకు అద్దె చెల్లించేందుకు ఏటా లక్షలాది రూపాయలను ప్రభుత్వ చెల్లిస్తోంది. ప్రస్తుతం ఖాళీగా ఉన్న భవనాలు, ప్రభుత్వ స్థలాలను వినియోగంలోకి తీసుకువస్తే ప్రభుత్వానికి అద్దెల రూపేణా చెల్లిస్తున్న డబ్బు మిగలడంతో పాటు ప్రభుత్వ స్థలాలు దుర్వినియోగం కాకుండా నిరోధించవచ్చునని ఈ ప్రాంతీయులు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.



శిథిలావస్థకు చేరిన ఆస్పత్రి సిబ్బంది క్వార్టర్స్



అసాంఘిక కార్యకలపాలకు అడ్డాగా మారిన వంశధార అతిథి గృహం ప్రాంతం

ఝల్లుమన్న జానపదం



మాకన్నపల్లిలో జానపద వేడుకలను ప్రారంభిస్తున్న కోరాడ లింగమూర్తి తదితరులు



కళాకారుల నృత్యప్రదర్శన

పలాస: పలాస మండలం మాకన్నపల్లిలో గురువారం రాత్రి జానపదం ఝల్లుమంది. ప్రపంచ జానపదం దినోత్సవం సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన జానపద కళాకారులు తమ నృత్యాలు, పాటలతో హోరెత్తించారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో బొడ్డపాడు జెస్సీ ఈవెంట్స్, బొడ్డపాడు ఎస్.డి.ఆర్ ఫోక్స్, కుమారి సుదీప్త శాస్త్రీయ నృత్యాలు, మాకన్నపల్లి యువశక్తి యువజన సంఘం నృత్యాలు, నీలావతి కోలాటం, వివిధ గ్రామాల నుంచి వచ్చిన కళాకారులు విభిన్న వేషధారణలతో ప్రజలను మైమరిపించారు. గాయకుడు ఎ.ఉదయ్‌భాస్కర్ తన పాటలతో ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాడు. జానపదానికి ప్రాణప్రతిష్ట చేసిన ఉద్దానం గద్దకు వందనాలు తెలిపారు. కార్యక్రమంలో ఉదయ్‌భాస్కర్‌తో పాటు సిక్కోలు జానపద సాహిత్య వేదిక అధ్యక్షుడు రాపాక ధనరాజు, కార్యదర్శి బత్తిన రామారావు, కోశాధికారి మామిడి క్రిష్టారావు, ఉపాధ్యక్షుడు దున్న రామారావు,ప్రచార కార్యదర్శి కుత్తుం వినోద్, గౌరకల లోకేశ్వరరావు, పుక్కళ్ల రాజేంద్ర, చెల్లూరి నీలకంఠం, డాక్టరు కుమార్‌నాయక్, మామిడి గణపతి, తులసయ్య,తెప్పల అప్పారావు, కోరాడ లింగ మూర్తి,దున్న చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

అచ్యుతాపురం ఘటనపై ప్రభుత్వం తీరు దారుణం



కంచిలి:అచ్యుతాపురం ఘటనపై ప్రభుత్వం తీరు దారుణంగా ఉందని ఎమ్మెల్సీ నర్తు రామారావు విమర్శించారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఘటన జరిగిన రెండ్రోజులు గడిచినా ఇంతవరకు ప్రభుత్వం మృతులకు అందించే నష్టపరిహారానికి సంబంధించి ఎటువంటి ప్రకటన చేయకపోవడం దారుణమన్నారు. సంఘటనా స్థలానికి అంబులెన్స్‌లను కూడా రప్పించలేని దుస్థితిలో ప్రభుత్వ పరిపాలన తయారవ్వడం ఆశ్చర్యం కల్గిస్తోందన్నారు. 18 మంది మృతి చెందినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం విచారకరమన్నారు. ఘోర ప్రమాదంలో మృతిచెందిన, గాయపడిన వారికి పరిహారాన్ని ప్రకటించడంలో స్పష్టత లేదన్నారు. ఈ ఘటనకు సంబంధించి కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు మిక్కిలి ఆక్షేపణీయమని అన్నారు.

గ్రామ సభలో గుర్తించిన పనులకే ప్రాధాన్యం

సోంపేట: గ్రామ సభలో గుర్తించిన పనులకే ప్రాధాన్యం ఇస్తామని, గ్రామ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పనులు గుర్తించాలని ఎంపీడీవో బి.వెంకటరమణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. శుక్రవారం నాటి గ్రామసభల్లో గ్రామస్తులు తెలియజేసిన ప్రతి పనిని తీర్మానం చేయాలన్నారు. ఏపీవో జి.భాస్కరరావు పాల్గొన్నారు.

గ్రామ సభలను విజయవంతం చేయండి

కంచిలి: మండలంలోని 31 పంచాయతీల పరిధిలో శుక్రవారం నుంచి నిర్వహించనున్న ఉపాధిహామీ గ్రామసభల్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి, పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ వి.జయరాజ్ కోరారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, ఉపాధిహామీ క్షేత్ర సహాయకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఈ గ్రామసభలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే ఉపాధి పనులు, ప్రజా సమస్యలపై వినతులు స్వకరిస్తామన్నారు. గ్రామసభలను స్థానిక పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా వ్యవహరించి నిర్వహిస్తారని చెప్పారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఉపాధి వేతనదారులు పాల్గొనాల్సిందిగా కోరారు. ఉపాధిహామీ విజిలెన్స్ అధికారి బి.లవరాజ్, డ్వామా ఏపీడీ సీహెచ్ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో వి.నీరజ పాల్గొన్నారు.

పక్కాగా నివేదికలు

కవిటి: గ్రామాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించిన నివేదికలు పక్కాగా సిద్ధం చేయాలని ఎంపీడీవో పి.సూర్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల మండలస్థాయి అధికారులతో సమావేశమయ్యారు. సీసీరోడ్లు, సీసీ కాలువలు, గ్రావెల్ రోడ్ల నిర్మాణాలపై గ్రామసభల్లో తీర్మానం ద్వారా నివేదికలు సిద్ధం చేయాలన్నారు.

సేంద్రీయ సాగుపై దృష్టిపెట్టాలి

సోంపేట:సేంద్రీయ విధానం ద్వారా పంటల సాగుపై రైతులు దృష్టిపెట్టాలని వ్యవసాయ సహాయ సంచాలకులు కె.జగన్మోహనరావు అన్నారు. పాత్రకొండ గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని గురువాం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. సాగు ఖర్చు ఆదా చేస్తూ, ఆరోగ్యకరమై వ్యవసాయ ఉత్పత్తులు దిగుబడికి, సేంద్రీయ ఆహారంగా ధ్రువీకరణ కోసం పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి, వ్యవసాయ సహాయకులు కె.ఉష ఉన్నారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

కాశీబుగ్గ: సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. పలాస సూదికొండ కాలనీలోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు నెలకు రూ. మూడు వేలకు పెంచాలని, ఐదునెలలుగా పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులను, ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్ చార్జిలను వెంటనే విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న కుక్, కమాటీ, వాచ్‌మెన్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన

ఇచ్ఛాపురం: ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పని సరిగా హెల్మెట్‌ని ధరించాలని సీఐ ఎం.చిన్నంనాయుడు సూచించారు. మున్సిపాలిటీ పరిధి పురుషోత్తపురం ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు వద్ద పట్టణ పోలీసులు గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా హెల్మెట్‌లు లేకుండా వాహనాలు నడిపిన వారిని ఆపి అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి ఎస్సై ఎస్ లక్ష్మణరావు ఉన్నారు.

కంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కవిటి: కంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని రాజపురం ఏపీ మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ మాడెం ఈశ్వరరావు అన్నారు. పాఠశాలకు చెందిన 460 మంది విద్యార్థులకు గురువారం నేత్ర పరీక్షలు చేశారు. జిల్లా అంధత్వనివారణ సంస్థ సిబ్బంది సేవలందించారు.

ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట

కవిటి: మండలంలోని వరక పంచాయతీ సన్యాసిపుట్టుగలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని భక్తులు దర్శించుకొని పూజలు చేశారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేత

కాశీబుగ్గ: మందస మండలం కొత్తపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పైల సుధారాణి పని చేస్తూ ఇటీవల బదిలీ అయ్యారు. ఆమె నేతృత్వంలో పలువురు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ప్రతిభ కనబర్చారు. దీంతో వారికి నగదు ప్రోత్సాహక బహుమతులను సోమవారం అందజేశారు. ఇన్‌చార్జి హెచ్ఎం ఎస్.గణేశ్వరరావు, ఉపాధ్యాయులు గవ్వ భీమారావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

మొక్కలు నాటివేత

ఇచ్ఛాపురం రూరల్: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎంపీపీ బోర పుష్ప అన్నారు. 'మదర్ ఫర్ ప్లాంట్' కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో గురువారం మండల స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఆమె ప్రారంభించారు. ఏపీవో పి.శ్రీనివాసరావు, కారంగి మోహనరావు, పిట్ట మామయ్య పాల్గొన్నారు.

సంరక్షణ అందరి బాధ్యత

సంతబొమ్మాళి: మొక్కలను నాటి వాటి సంరక్షణ వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు పరిమళ, నందిని అన్నారు. పీహెచ్‌సీ ఆవరణలో టెక్కలి, నౌపడ సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో మొక్కలను నాటారు.

డాక్టర్ ముత్యానికి జనజాగృతి నివాళి



మాట్లాడుతున్న డాక్టరు కుమార్‌నాయక్

పలాస: శ్రీకాకుళం ఉద్యమ సాహిత్య ఉద్యమ చరిత్ర గ్రంథ రచయత, పరిశోధకుడు, ప్రసిద్ధ కవి డాక్టర్ ముత్యం మరణం సాహితీ లోకానికి తీరని లోటని పలువురు వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. కాశీబుగ్గలో గురువారం బహుగ్రంథకర్త డాక్టర్ ముత్యం సంతాప సభను జనజాగృతి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న పలాస డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ.. సమాజంలో జనాలను జాగృతి పరిచే విధంగా మంచి కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. జిల్లాతో ముత్యానికి ఉన్న అనుబంధాన్ని వివరిస్తూ ఆయన స్మృతి పథంలో ఒక కవితను జనజాగృతి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు తెప్పల కృష్ణమూర్తి వినిపించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు, ప్రముఖ జానపద కళాకారుడు, సినీ నటుడు డాక్టర్ కుమార్‌నాయక్, కోశాధికారి బాలకృష్ణవర్మ, కళాశాల అధ్యాపకులు కె.మధు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు హెచ్.వై.దొర, ఎస్.అప్పారావు, పి.వెంకటరావు, కె.పి.రామన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నివారణ టీకాలు



పశువులకు వ్యాక్సినేషన్ చేస్తున్న పశువైద్య సిబ్బంది

కంచిలి: పశువ్యాధులపై ఎటువంటి నిర్లక్ష్యం ప్రదర్శించ వద్దని మండల పశువైద్యాధికారిణి టి.శిరీష అన్నారు. బూరగాం గ్రామంలో గాలికుంటువ్యాధి వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ గిరిబాబు

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధిలో కొన్నేళ్లుగా ఆక్రమణకు గురైన ఆంధ్రాబ్యాంకు రోడ్డు పనులకు మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో ఉన్న ఆంధ్రబ్యాంక్ రోడ్డులోని కొంత స్థలం కొన్నేళ్లుగా ఆక్రమణకు గురైందన్నార. ఇటీవల కోర్టు ఆదేశాల మేరకు ఆక్రమణలు తొలగించి యుద్ధ ప్రాతిపదికను రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపడుతున్నామన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆక్రమణకు గురైన రోడ్లపై ప్రత్యేక దృష్టి సారిస్తామని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఆంధ్రబ్యాంక్ రోడ్డు అత్యంత విశాలమైనగా ఉందని.. ఆక్రమణల తొలగించడంతో కొత్త రూపు వచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్, కౌన్సిలర్ పప్పులప్రసాద్, నాయకులు ఇచ్ఛాపురం క్రిష్టారావు, చలపాకుల నేత్రానందం, కాంట్రాక్టర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

శాకాహారంపై అవగాహన



శాకాహారంపై ప్రచారం చేస్తున్న పిరమిడ్ ధ్యాన కేంద్రం సభ్యులు

కంచిలి: ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతిఒక్కరూ శాకాహారాన్ని భుజించడంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని పిరమిడ్ ధ్యాన కేంద్రం ప్రతినిధులు అన్నారు. మండలంలో బూరగాం గ్రామ పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో శాకాహారంపై ప్రచార కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. గ్రామగ్రామాన పర్యటించి అందరూ శాకాహారులుగా మారాలని, శాఖాహారం తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు బి.కామేషరెడ్డి, ధ్యాన కేంద్రం సభ్యులు గేదెల మోహిని పాల్గొన్నారు.

కాలిబాటలతో ప్రయోజనాలు

ఇచ్ఛాపురం రూరల్: వరినాట్లు వేసే సమయంలో కాలిబాటలు వేసుకుంటే అధిక ప్రయోజనాలు ఉంటాయని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి ఎం.చిట్టిబాబు అన్నారు. గురువారం మశాకపురం గ్రామంలో కాలిబాటతో వరినాట్లు వేసే పద్ధతిని వివరించారు. నాట్లు వేసిన తర్వాత పొలంలో ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల వెడాల్పున కాలిబాటలు వేయాలని అన్నారు. రైతులు ఎరువులు ఉపయోగించి ప్రకృతి వ్యవసాయంపై మక్కువ చూపించాలని సూచించారు. ఈ సందర్భంగా మోడల్‌గా నగిరెడ్ల కృష్ణవేణి పంట పొలంలో ప్రయోగాత్మకంగా కాలిబాటలు వేశారు. కార్యక్రమంలో ఐసీఆర్పీలు పాండవ రూప, కుమారీలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

సోంపేట: బారువ గ్రామానికి చెందిన నెయ్యిల చంద్రావతి కుటుంబానికి సోంపేట సత్యసాయి సేవా సమితి సభ్యులు రూ. 7,200 ఆర్థిక సాయం అందజేశారు. నిరుపేద కుటుంబం కావడంతో చంద్రావతి వివాహానికి పసుపు, కుంకుమ, చీర నగదు అందజేసినట్లు పేర్కొన్నారు. సత్యసాయి సేవాసమితి సభ్యులకు చంద్రావతి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు.

జాబ్ కార్డుల తొలగింపుపై నిలదీత

- సంతబొమ్మాళి మండల సమావేశం



సమావేశ వేదికపై ఎంపీపీ రాజేశ్వరి, జెడ్పీటీసీ సభ్యుడు వసంతరెడ్డి తదితరులు

సంతబొమ్మాళి: ఉపాధి హామీ పథకం వేతనదారుల జాబ్ కార్డులను తొలగించడం తగదని సభ్యులు అన్నారు. సంతబొమ్మాళి పంచాయతీలో వేతనదారుల జాబ్ కార్డులను తొలగింపుపై నిలదీశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మేరుగు రాజేశ్వరి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు సమస్యలను ప్రస్తావించారు. కనీసం సమాచారం లేకుండా సుమారు 100 జాబు కార్డులు ఏవిధంగా తొలగించారని సంతబొమ్మాళి సర్పంచ్ కళింగపట్నం లక్ష్మి ఉపాధిహామీ పథకం ఇన్‌చార్జి ఏపీవో మురళిని నిలదీశారు. దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఏపీవో సమాధానం ఇచ్చారు. కీలకమైన శాఖలకు చెందిన ముఖ్య అధికారులకు బదులు కిందిస్థాయి సిబ్బంది సమావేశానికి హాజరయ్యారు. దీంతో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పే పరిస్థితి లేకుండా పోయింది. ఇరిగేషన్ శాఖపై సభ్యులు లేవనెత్తే అంశాలపై పూర్తి స్థాయిలో సమాధానం రాలేదు. వెలుగు అధికారులు మాట్లాడుతూ.. పీఎం ఈజీ పథకం కింద రూ. లక్ష నుంచి రూ. 10 లక్షల వరకు సబ్సిడీపై అర్హులకు రుణాలు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. శాశ్వత భూహక్కు చట్టంపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి పరిష్కరిస్తామని సంబంధిత సిబ్బంది చెప్పారు. 2014 నుంచి 2019 మధ్యలో నిర్మించి ఒక రూపాయి బిల్లు పడిన ఇళ్లకు సంబంధించిన వివరాలను ప్రత్యేక యాప్ ద్వారా సర్వే చేస్తున్నట్లు హౌసింగ్ అధికారులు చెప్పారు. మత్స్యశాఖపై జరిగిన చర్చలో భావనపాడు ఫిషింగ్ హార్బర్ వద్ద ఏర్పడిన ఇసుక మేటలకు ప్రత్యేకంగా బ్రేక్ వాటర్ పనులు నిర్మించి శాశ్వత పరిష్కారం చూపించేందుకు ప్రభుత్వం దష్టికి తీసుకొని వెళ్లమని మత్స్యశాఖ అధికారి ధర్మారాజు పాత్రో తెలిపారు. వ్యవసాయశాఖపై జరిగిన చర్చలో ఎరువులు, డీఏపీలు అందుబాటులో లేవని సభ్యులు నిలదీశారు. సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు వ్యవసాయ అధికారి సురేష్ సమాధానం ఇస్తూ మూడు రోజుల్లో పైఅధికారులతో మాట్లాడి అందుబాటులోకి తెస్తామన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి, ఎంపీడీవో ప్రేమలీల, వైస్ ఎంపీపీలు తులసమ్మ, చింతామణి పాల్గొన్నారు.

సీఐ మోహనరావుకు అభినందనలు

కాశీబుగ్గ: కాశీబుగ్గ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన దాడి మోహనరావును పలువురు నాయకులు గురువారం పోలీసు సర్కిల్ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. సీఐని కలిసిన వారిలో రాష్ట్ర బీసీ సెల్ నాయకులు లొడగల కామేశ్వరరావు, కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ, నాయకులు దడేల నరసింహులు, సవర రాంబాబు, కొత్త సత్యం, మీల జోగారావు, బద్రి గోపాల్, పుట్టా లోకు ఉన్నారు.

మాజీ మంత్రిని కలిసిన ప్రెస్‌క్లబ్ సభ్యులు



మాజీ మంత్రి అప్పలరాజుకు కలిసిన ప్రెస్‌క్లబ్ సభ్యులు

కాశీబుగ్గ: మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును పలాస ప్రోగ్రెసివ్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు గురువారం తన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులను అప్పలరాజు అభినందించారు. ప్రెస్ క్లబ్‌కు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. మాజీ మంత్రిని కలిసిన వారిలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దేవ విశ్వేశ్వరరావు, కార్యదర్శి నారాయణరావు, ఉపాధ్యక్షులు దట్టి అనంత్‌కుమార్, సభ్యులు నల్లాల అశోక్, గంగు శ్రీనివాసరావు, యోగి, వేణుయాదవ్ ఉన్నారు.